మినీ కథ

# ముక్కుపుడక



పెళ్ళిచూపులు అయ్యాయి. ఇంటి కెళ్ళాక అన్ని విషయాలు రాస్తామని చెప్పి బయటపడ్డారు. ఓ రైలు, ఓ బస్సు, ఓ రిక్షా మారాక ఇల్లు చేరారు.

"ఏమ్రా? అమ్మాయి నచ్చిందా? పెళ్ళంటూ చేసుకుంటే ఆ అమ్మాయినే చేసుకుంటావా? నీకేం మతిపోలేదు కదా?" అందాకా ఆపుకున్న కోపం వెళ్ళగక్కింది రుక్మిణి.

"అవునమ్మా! నేను చేసుకోకపోతే ఆ అమ్మాయిని ఎవరు చేసుకుంటారు చెప్పు?" కరుణాకర్ మాటలలో కరుణ కట్టలు తెంచుకున్నట్లనిపించింది రుక్మిణికి.

రుక్మిణికి నోట మాట రాలేదు. ఒక్కగానొక్క కొడుక్కి అప్సరసలాంటి కోడల్ని వెయ్యాలని, బంగారం లాంటి సంబంధాన్ని తేవాలని వెంకయ్య, రుక్మిణి ఎన్నెన్నో సంబంధాలు చూచారు. ఎన్నో వూళ్ళు తిరిగారు. ఏ ఒక్కటీ కరుణాకర్‌కు నచ్చలేదు. కారణం ఇదీ అంటూ అతనేమీ తల్లిదండ్రులకు చెప్పలేదు. ఈ అనాకారిని చేసుకుంటానంటే ఓ మూల బాధగానే వున్నా, మరో మూల తన కొడుకు స్త్రీ జాతిని ఉద్ధరించే అవతార పురుషుడిలా కనిపించాడు.

మరో ప్రశ్న వెయ్యకుండానే వంటింట్లోకి నడిచింది రుక్మిణి.

"ఏమిట్రా నీగోల?" వెంకయ్య కొడుకుని కసిరాడు.

"గోల కాదు నాన్నా! నాకా అమ్మాయి కావాలి" అన్నాడు కరుణాకర్ మామూలు ధోరణిలోనే.

"కనీసం కారణాలు చెప్పరా? మీ అమ్మకి చెప్పిందే కారణం అయితే నాకు మాత్రం తృప్తిగా లేదురా" వెంకయ్య మాటలలో బుజ్జగింపు స్పష్టమయింది.

"నేనింకా పసివాడిని కాదు నాన్నా! నాకూ కొన్ని అభిరుచులు, అభిప్రాయాలు వున్నాయి."

"ఏమిటో అవి?" కరుణాకర్‌లో ఇంత ధైర్యం, తెగువ చూసి ఆశ్చర్యంగానే అడిగాడు వెంకయ్య. కొడుకు అభిరుచులెలా వుంటాయో తెలుసుకోవాలని వుందతనికి.

"ఒక్క విషయం నాన్నా! ఎవడైనా అందమైన పెళ్ళాన్ని ఇంట్లో పెట్టుకుని బయటకి వెళ్ళగలడా? వెళితే మూడొంతుల ప్రాణం ఆమె మీదే వదిలిన వాడికి బయట పనులు అవుతాయా?"

వెంకయ్య కళ్ళు పెద్దవయ్యాయి.

"ఇంకో విషయం...ఆ బాధ ఎందుకని పెళ్ళాన్ని వెంటేసుకెళితే చూచే జనం చూపుల్తో కొరికేసుకుంటే ఇక మిగిలేది అశాంతే కదా!"

వెంకయ్యకి మతిపోతోంది."

"మరో విషయం..కొందరాడవాళ్ళు ముక్కు పుడక కోసం మగాళ్ళని కైమా చేసి వేపుకు తింటారు. ఈ అమ్మాయితో నాకా బాధేం లేదు."

వెంకయ్య ఊపిరి బిగపట్టాడు.

"మరేం లేదు నాన్నా! ఆ అమ్మాయికి సరిగ్గా ముక్కుపుడక వుండాల్సినచోట పెద్దపులిపిరికాయుంది. అందువల్ల తనకో ముక్కుపుడక కావాలంటూ నన్ను వేధించనే వేధించదు" సంబరపడిపోతూ పెరట్లోకి నడిచాడు కరుణాకర్.

కొడుకు మాటలు వంటింట్లోంచే విన్న రుక్మిణి కాసేపు నివ్వెరపోయింది. వాళ్ళి అభిరుచులు విన్నాక వెంకయ్యకి వున్న ప్రాణం పోతున్నట్లనిపించింది!!

—వాసాల నరసయ్య

